

# పెద్దలకు మాత్రమే

భాను చంద్రిక

## సొంత మనిషి

ఆ పందిట్లో బాజాలు జోరుగా మోగుతున్నాయి. ఆ పందిరి క్రీనీడ ఆవరించే ఇంట్లో ఒంటరిగా కూర్చునివున్న సుమతి గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. పందిరినిండా సందడి, సంబరం. సుమతి గుండెనిండా ఆలోచనల అల్లకల్లోలం. గుండెకు గండిపడి, రక్తం కన్నీరుగా మారితే ఆ కన్నీటిని పన్నీరుగా మార్చి పెళ్ళికి వచ్చిన వారిపై కేరింతలతో చల్లుతున్నారు.

ఆ నవ్వుల అలల జల్లులో తడిసి పోవలసింది తను. పెళ్ళి కొడుకుగా కూర్చున్న మునీంద్ర ప్రక్కన కూర్చుని, అవును మరి. ఆ స్థానం తనకు చెందాల్సింది. కట్నం తక్కువ పడిందన్న కారణంతో తండ్రి కాదు కూడదు అని హుంకరిస్తే గంగిరెద్దులా తలవూపి ఇంకో పడతి మెడలో పలుపుతాడు వేస్తున్నాడు మునీంద్ర.

తామిద్దరి మధ్య వున్న ప్రేమ ఇప్పుడిప్పుడే క్రొత్త మొగ్గ తొడిగింది కాదు. పక్క పక్క ఇళ్ళే కావడం... ఒకే క్లాస్‌లో చదవడంతో... ఎప్పుడో బుద్ధి, జ్ఞానం కన్నా ముందే ఏర్పడిన అపురూప భావం. తల్లిదండ్రులకు తెలియదేమో, తెలిసినా ఎంతమంది పెద్దలు పెద్ద మనసుతో అర్థం చేసుకుని దీవిస్తారు? తారకలు చంద్రునితో విడ్డూరంగా చెప్పుకోవలసిన తమ ప్రేమ కథ... మునీంద్ర పిరికితనంతో హృదయపు అట్టడుగుపొరన చేరింది.

చెదిరిన మనసుతో... కరిగిపోయిన కలలతో ఆ ఊర్లో వుండలేక పోయింది సుమతి. రెండేళ్ళు ప్రైవేట్ కంపెనీలో పని చేసింది. వర్తమానం గతంలో కలుస్తూ గతాన్ని రూపుమాపింది. అయినా మాయని మచ్చలా ఓ జ్ఞాపకం...

ఆ రోజే ఊర్లోకి అడుగుపెట్టింది. మునీంద్ర చెల్లి కన్పించింది.. .“ఎప్పుడొచ్చావక్కా?” నోటితో నవ్వుతూనే నొసటితో వెక్కిరించినట్టు అన్పించింది ఎందుకో.

“ఇంటికి పోదాం రా” అనే పిలుపుని నిర్లక్ష్యం చేయలేకపోయింది.

నరాల తీగలను మీటి అనురాగ రాగం విన్పించిన మునీంద్ర...

తన మనసు దోచుకుని ఆ స్థానంలో ఆణిముత్యంగా తన ముఖ బింబాన్ని దాచి, వేదనా ఆలయంలో తననుంచి వేరై పోయిన మునీంద్ర... కమ్మటి కలల్ని, అనుభవించబోయే ఆనందమయ జీవితాన్ని అక్షరమక్షరం మృదుకుసుమంగా ఎన్నో వూసులు చెప్పిన ఒకప్పటి తన మునీంద్ర... ఇప్పుడు తనకేమీకాని మునీంద్ర బెటర్ హాఫ్‌ని చూడాలని ఏ మూలోవున్న కోరిక అదటుగా బయటికి వచ్చింది.

మునీంద్ర భార్య స్వర్ణ తానూహించుకున్నట్లు పరిమళ భరితమైన నన్నజాజి తీగలా లేదు. మునీంద్ర మది మురిసేలా ముద్దమందారంలా లేదు. మైకం కల్గించే నైట్‌క్వీన్‌లా లేదు... తాళికట్టిన భర్త హృదయ సామ్రాజ్య అధిపతినే ఠీవి లేదు. అతి మామూలుగా కన్పించే స్వర్ణను పరకాయించి చూస్తే మునీంద్ర హృదయ వైశాల్యాన్ని తన చిన్ని కళ్ళలో దాచుకున్నట్టు.

అతని జీవితాన్ని తన మాంగల్యంలో బంధించి, అతని స్వాతంత్ర్యా


### హెచ్చరిక

ఇప్పుడు మీరు సెంటర్ సెన్సేషన్ కథ చదువుతున్నారు. ఈ కథలు పెద్దలకు మాత్రమే ప్రత్యేకించి రాయిస్తున్నవి. సకుటుంబంగా చదువుకునే ఆంధ్రభూమిలో పర్సనల్‌గా చదువుకునే కథ సెంటర్ సెన్సేషన్. (పిల్లలు చదవకూడదని అనుకుంటే) మీరు మాత్రమే చదువుకుని పిన్నవాళ్ళు చదవకుండా జాగ్రత్తపడేందుకు ఒక సౌకర్యం కూడా వుంది. సెంటర్ సెన్సేషన్ కేవలం 'అడల్ట్ స్టోరీ' అనుకున్నవాళ్ళు ఈ కథ నాలుగు పేజీలు 'ఫక్'మని లాగేస్తే పుస్తకంనుంచి వేరైపోతాయి ఈ పేజీలని మీరు మంచి మూడ్‌లో వున్నప్పుడు మళ్ళీ చదువుకోడానికి అనుకూలంగా ఇంచక్కాగా సెంటర్ సెన్సేషన్ కలెక్షన్‌గా ఫైల్ చేసుకోవచ్చు.

## సెంటర్ సెన్సేషన్

న్ని పూర్తిగా గెలుచుకున్న ఓ విధమైన... అహంకారం నిండిన రాక్షసానందం కన్పించింది సుమతికి

"మా ఆయన్ని మీరు ప్రేమించారటగా?" హేళనగా నవ్వుతూ బాంబు పేల్చింది. స్తంభించిపోయింది సుమతి.



తన మదిలో అతి పవిత్రంగా..

అపురూపంగా వున్న భావం బయటపడితే ఇంత వికృతంగా వుంటుందని మొదటిసారిగా తెలుసుకుంది. "ఏమేం ఆశలు పెంచుకున్నారు ఆయనపైన? అయినా చదువుకునే వాళ్ళకు ఇదేం పాడు రోగమో అందంగా కన్పించగానే అర్జెంటుగా ప్రేమలోపడిపోతారు. ఎన్ని వేషాలైనా వేసి తాళి కట్టించుకోవాలనుకుంటారు. అయినా అదృష్టం వుండొద్దూ? అవునూ... ఆయనకే మాత్రం కోరిక లేదటగా మీ మీద. మీరెలా వెంటబడ్డారు?" ఆడదాన్ని మాటలతో హింసించి, అతి మెత్తని హృదయాన్ని గ్రైండర్లో వేసినట్లుగా నలగ్గొట్టే నేర్పు, శక్తి ఇంకో ఆడదానికే వుంది.

అంతర్గతంగా వుండే అసూయ ... తను మామూలుగా భూమ్మీదే వున్నా సాటి స్త్రీని వెటకారంతో పాతాళానికి తొక్కి వేయాలనే పైశాచిక ఆలోచనలు... కలలో చూసింది సుమతి. ఆకాశంలో వుండి తనకోసం నేలపైకి చేయి చాచిన ప్రేమమూర్తి మునీంద్ర తన గురించి ఇంత హీనంగా... నమ్మలేకపోయింది సుమతి.

ఇద్దరూ కలిసి నడుస్తుంటే దేవలోకంలోని పారిజాతాన్ని పట్టుకున్నట్టు అతి జాగ్రత్తగా తన చేయి పట్టుకుని నడిచేవాడు.

మాటల మైకంలో పొరపాటుగా మాట్లాడినా ముడిపడిన కనుబొమ్మల్ని చూసి గుండెకు గులాబీ ముళ్ళు గుచ్చుకున్నట్లు బాధపడేవాడు...

**ఇప్పుడు మీరు సెంటర్ సెన్సేషన్ కథ మూడవ పేజీ చదువుతున్నారు.**

అవును... అంతే. ఓ చిరునవ్వు మునీంద్ర మాటలకు మురిసి మైమరచినప్పటి నవ్వుతో.




ఇసుక రేణువులు పాదాల్ని కసిగా కాటేస్తాయని హృదయాన్ని తివాచీలా పరిచి నడిపించిన అపూర్వ ప్రేమికుడు మునీంద్ర.

ఊహూ... ఇంత నీచమైన మాటలు ఆనోటినుండి రావు. కేవలం తనను బాధపెట్టాలనే కారణం తనుస్వర్ణకన్నా అందంగా వుంది... ఎంత చదువుకున్నది. ఈర్ష్యలో...

'నిజమే... మునీంద్రను ప్రేమించాను. నీవిప్పుడు ఇంతగొప్పగా ఫీలవుతున్నావే... అతన్ని సొంతం చేసుకున్నానని... అంత కంటే ఎన్నో ఏళ్ళు ముందుగా మున్నీ హృదయాన్ని పొందాను. అతనితో కలలు పంచుకున్నాను. అతని తొలి ముద్దు రుచి చూశాను. అంతా అంతా టేస్ట్ చేశాను. ఇప్పుడు నీ భర్త ... నా ఎంగిలి'' కూల్‌గా పిడుగు వదిలి తాపీగా లేచింది సుమతి.

''అంతేకాదు. ఇంట్లో... ఏమీ న్ నీతో ఏ మాత్రం అసంతృప్తివున్నా వెంటనే నా దగ్గరికి వచ్చేస్తాడు. ఎందుకంటే నేనింకా ఒంటరిగానే వున్నాను. ప్రేమ అనే పదానికి అర్థం నీకు తెలియదేమో. అందుకే అందమైన ఆ భావాన్ని వినలేనంత ఘోరంగా చిత్రీకరించావు. మున్నీని అర్థం చేసుకో... ప్రేమతో అతన్ని పూర్తిగా నీ సొంతం చేసుకో.'' ఊహించని మాట విని శిలలా నిల్చుండిపోయిన స్వర్ణని చూసి నవ్వుతూ బయటకి వచ్చేసింది. అప్పటికే తన కంటిలో నిల్చిన నీటి ముత్యాల్ని పసిగట్టేస్తుందేమోనని.

**వచ్చేవారం మరో**
**సెంటర్ సెన్సేషన్** *